# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## యస్.పి రాజారాం

## (సితార జనవరి 20,1980 సంచిక నుంచి)



"**ఏ కొత్త దర్శకుడి ప్రతిభ అయినా** ఆయన దర్సకత్వం వహించిన తొలి చిత్రం విజయవంతమైతే రాణింపులోనికి వస్తుంది. అప్పుడు వెంటనే ఆయనకు ఛాన్సులు వస్తాయి. లేకపోతే మరో విజయవంతమైన చిత్రం వచ్చేదాకా ఆయన ప్రతిభకు గుర్తింపు ఉండదు. ఇదీ ప్రస్తుతం చలనచిత్ర రంగంలో కనిపిస్తున్న ధోరణి" అంటారు కొత్త దర్శకుడు యస్.పి.రాజారాం.

రాజారాం దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'సమాజానికి సవాల్' ఈ మధ్యనే విడుదలైంది. రాజారాం నిర్మాత వెంకన్నబాబు సోదరుడు. సినిమా పరిశ్రమకి రాజారాం కొత్తవారైనా మద్రాసు ఫిలిం ఇన్స్‌టిట్యూట్‌లో "నేను తీసుకున్న డిప్లొమా అనుభవం ఎంతగానో ఉపయోగపడింది. దీనివల్ల టేకింగ్‌లో ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేకుండా వీలయినంతవరకూ బాగా తీయగలిగాను" అంటారు రాజారాం.

"నిర్మాతలు, పంపిణీదారులు తమ చిత్రం విజయవంతం కావాలనే ఆలోచిస్తారు. అది సహజం కూడా! తాము పెట్టుబడి పెట్టిన డబ్బు తిరిగి రావాలి కదా! అయితే వారి చిత్రానికి దర్శకత్వం వహించే దర్శకుడు ఎంత టాలెంటు కలిగివున్నా కొన్ని కారణాల వల్ల ఆ చిత్రం విజయవంతం కాకపోవచ్చు. అంత మాత్రాన ఆ దర్శకుడికి మళ్ళీ అవకాశం

ఇవ్వకపోవడం మంచిదికాదు. అతనికి మరో అవకాశం ఇస్తే గత చిత్రం అనుభవంతోను, ప్రతిభతోను విజయవంతంకాగల చిత్రాన్ని నిర్మించగలడు" అంటారు రాజారాం.

"మీ తొలి చిత్రం అనుభవాలు వివరిస్తారా?" అని అడిగినప్పుడు –

"ఒక యాక్షన్ చిత్రంలో క్వాలిటీని ఆశించలేం. ఎందుకంటే అలాంటి చిత్రాల్లో ఉన్నత ప్రమాణాలను సాధించడం చాలా కష్టం. 'సమాజానికి సవాల్' చిత్రానికి దర్శకత్వం వహించిన తర్వాత నేను గ్రహించింది ఇదే. కొంచెం క్వాలిటీ కనిపించినా అదేదో గొప్ప విషయంగానే అనిపిస్తుంది. 'సమాజానికి సవాల్' చిత్రంలో నటించిన వారందరూ బిజీ నటులు. వారందరూ 'కొత్త' అన్న భావం కనిపించనీయకుండా నాకు ఎంతో సహకారం అందించారు. ఇది నా తొలి చిత్రం అని చిత్రం చూసే ప్రతీ ప్రేక్షకుడు మరచిపోకూడదు. ఎందుకంటే ఈ చిత్రంలో పరిస్థితులతో రాజీపడి తెలిసే కొన్ని తప్పులు చేశాను. అలా చేయక తప్పింది కాదు. ఇందుకు ప్రేక్షకులు నన్ను మన్నించాలి. ఆ తప్పులు నా రెండో చిత్రంలో చేయనని మాట ఇస్తున్నాను" అన్నారు రాజారాం.

"మీ జీవితాశయం ఏమిటి?" అని ప్రశ్నిస్తే.

"ఇంతవరకూ మన తెలుగు చిత్రాలకి ప్రాంతీయ బహుమతులు తప్ప జాతీయ బహుమతి ఒక్కటి కూడా రాలేదు. ఇది మన తెలుగు పరిశ్రమకు లోటే. కాలం కలిసి వస్తే జాతీయ బహుమతి వచ్చే చిత్రాన్ని నిర్మిస్తాను. కానీ నేను దర్శకునిగా స్థిరపడి, నిలదొక్కుకునే వరకూ కమర్షియల్ చిత్రాలే తీస్తాను. అంతవరకూ అవార్డు చిత్రాల జోలికి పోను. ఫిలిం ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు కొన్ని ప్రత్యేక చిత్రాలను మాత్రమే తీయగలరనీ, నేటి స్పీడుకు వారు తట్టుకోలేరనీ కొందరుంటుంటారు. మేమూ కమర్షియల్ చిత్రాలు తీయగలమనీ, నేటి స్పీడుకు తట్టుకోగలమనీ, భారీ తారలతో భారీ చిత్రాలు తీయగలమనీ రుజువు చేసేందుకే తొలిసారిగా కమర్షియల్ చిత్రానికి దర్శకత్వం వహించాను" అన్నారు రాజారాం.

యస్.పి. రాజారాం ప్రస్తుతం ఉదయ్ ఆర్ట్ ఇంటర్నేషనల్ వారి చిత్రానికీ, మరో రెండు చిత్రాలకీ దర్శకుడుగా ఎన్నికయ్యారు.

Post your comments